www.prajasakti.com

# ప్రజాశక్తి

శుక్రవారం 14 ఫిబ్రవరి 2025

## వైన్ షాపులపై పోలీసుల దాడులు

ప్రజాశక్తి - కాకినాడ

సిబ్బందికి సూచినలిస్తున్న ఎఎస్‌పి

నగరంలో నిబంధనలు ఉల్లంఘించిన వైన్ షాపులపై పోలీసులు మెరుపు దాడులు చేసి కేసులు నమోదు చేశారు. ఎఎస్‌పి మనీష్ దేవరాజ్ ఆధ్వర్యంలో రాత్రి 10 గంటలు దాటిన తరువాత తెరిచి ఉన్న వైన్ షాపులపై ప్రత్యేక బృందాలతో ఆకస్మిక దాడులు నిర్వహించారు. కాకినాడ సిటీలోని 1వ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో 4 షాపులు, 3వ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో 2, సర్పవరం స్టేషన్ పరిధిలో 2 షాపులు మొత్తం 8 బ్రాందీ షాపులపై దాడి చేసి కేసులు నమోదు నమోదు చేసినట్లు ఎస్‌పి కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది.



# ఇక సమరమే..!

**ముగిసిన పట్టభద్రుల ఎంఎల్‌సి నామినేషన్ల విత్‌డ్రా పర్వం - ఆఖరి రోజు 8 నామినేషన్లు ఉపసంహరణ**

**ఎన్నికల బరిలో 35 మంది అభ్యర్థులు - పిడిఎఫ్, టిడిపి అభ్యర్థుల మధ్య గట్టి పోటీ**

**పట్టభద్రుల ఓటర్ల ఫోన్ నెంబర్లన్నీ అధికార పార్టీ అభ్యర్థి చేతిలోకి - నిబంధనల ప్రకారం ఫోన్ నెంబర్లు ఇవ్వొచ్చా?**

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికల ప్రచార సమరం ఊపందుకోనుంది. ఫిబ్రవరి మూడో తేదీన ప్రారంభమైన నామినేషన్ల పర్వం గురువారం విత్‌డ్రాల పర్వంతో ముగిసింది. మొత్తం 54 మంది నామినేషన్లు దాఖలు చేయగా 11 నామినేషన్లు పరిశీలనలో తిరస్కరణకు గురయ్యాయి. ఇక మిగిలిన 43 నామినేషన్లలో విత్‌డ్రాకు ఆఖరిరోజైన గురువారం ఎనిమిది మంది అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. దీంతో ఎన్నికల బరిలో 35 మంది అభ్యర్థులు మిగిలారు. పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితా లెక్క తేలిపోవడంతో ఇక నుంచి ఎన్నికల ప్రచారం మరింత ఊపందుకోనుంది. నామినేషన్లు దాఖలు చేసిన అభ్యర్థుల్లో గురువారం ఎనిమిది మంది అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారని, 35 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారికంగా ప్రకటించారు. ఈ నెల 27న పోలింగ్ జరగనుంది. అందుకు సంబంధించి అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఎన్నికల్లో మొత్తం 3,14,984 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఉమ్మడి పశ్చిమ, తూర్పుగోదావరి జిల్లాల్లో మొత్తం 113 మండలాల్లో ఈ ఎన్నికలు జరగనుండగా ఓటర్లు తమ ఓటుహక్కు వినియోగించుకునేందుకు 440 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. ఈ ఎన్నికల్లో మొత్తం పురుష ఓటర్లు 1,83,347 మంది ఉండగా, మహిళా ఓటర్లు 1,31,618 మంది, ట్రాన్స్‌జెండర్ ఓటర్లు 19 మంది ఉన్నారు.

### ఓటర్ల ఫోన్ నెంబర్లు అధికార పార్టీ అభ్యర్థి చేతిలోకి

ఈ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థి డివి.రాఘవులు, టిడిపి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం నువ్వానేనా అన్నట్లు పోటీ పడుతున్నారు. అధికార పార్టీ అభ్యర్థి రాజశేఖరం గెలుపు కోసం కూటమికి చెందిన మంత్రులు, ఎంఎల్‌ఎలు, ఎంపీలతోపాటు కూటమి పార్టీలైన జనసేన, బిజెపి నేతలు పని చేస్తున్నారు. ఉద్యోగ, కార్మికులతోపాటు పలు ప్రజాసంఘాలు, పట్టభద్రులు పిడిఎఫ్ అభ్యర్థి డివి.రాఘవులు తరఫున ప్రచారం చేస్తున్నారు. తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో దాదాపు 3.14 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. ఓటర్లకు సంబంధించిన ఫోన్ నెంబర్లు మొత్తం అధికార పార్టీ అభ్యర్థి చేతిలోకి ఎలా వచ్చాయనే ప్రశ్న అందరినీ తొలిచేస్తోంది. నిబంధనల ప్రకారం ఓటర్ల జాబితాలో పేర్లు తప్ప ఫోన్ నెంబర్లు ఉండవు. ఎన్నికల నిబంధనల ప్రకారం ఓటర్ల ఫోన్ నెంబర్లు ఎవరికీ ఇవ్వకూడదని అధికారులు చెబుతున్నారు. మరి ఫోన్ నెంబర్లు అధికార పార్టీ నాయకుల చేతుల్లోకి ఎలా వెళ్లాయో అధికారులు, ఎన్నికల సంఘం చెప్పాల్సి ఉంది. ఫోన్ నెంబర్లు తీసుకున్న అధికార పార్టీ అభ్యర్థి తన వాయిస్ సందేశాలను ఓటర్లకు పంపిస్తూ తనకు ఓటేయాలని కోరుతున్నారు. ఓటర్ల ఫోన్ నెంబర్లు అభ్యర్థులకు ఇవ్వొచ్చు అనే నిబంధన ఉంటే బరిలో నిలిచిన మిగిలిన అభ్యర్థులందరికీ ఓటర్లు ఫోన్ నెంబర్లు ఇవ్వాల్సి ఉంటుంది. అలాకాకుండా అధికార పార్టీ అభ్యర్థికి మాత్రమే ఓటర్ల ఫోన్ నెంబర్లు వెళ్లడం సర్వత్రా చర్చనీయాంశమైంది. దీనిపై అధికారులు సమాధానం చెప్పాలనే డిమాండ్ పెద్దఎత్తున విన్పిస్తోంది. ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు సైతం ఈ ఫోన్ నెంబర్లను ఉపయోగించుకునే పరిస్థితి ఉంది. ఓటర్ల ఫోన్ నెంబర్లు అధికార పార్టీ అభ్యర్థికి వెళ్లడంపై ఎన్నికల అధికారులు స్పష్టత ఇవ్వాల్సి ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

### పోటీలో ఉన్న అభ్యర్థులు వీరే

1.దిడ్ల వీరరాఘవులు (డివి.రాఘవులు) (పిడిఎఫ్ అభ్యర్థి)
2.కాట్రు నాగబాబు (తెలుగు నవగర్జన)
3.షేక్ హుస్సేన్ (రిఫార్మ్ పార్టీ ఆఫ్ ఇండియా)
4.కట్టా వేణుగోపాలకృష్ణ (స్వతంత్ర అభ్యర్థి)
5.కాండ్రేగుల నరసింహం (స్వతంత్ర అభ్యర్థి)
6.కాళ్లూరి కృష్ణమోహన్ (స్వతంత్ర అభ్యర్థి)
7.కుక్కల గోవిందరాజు (స్వతంత్ర అభ్యర్థి)
8.కునుకు హేమాకుమారి (స్వతంత్ర అభ్యర్థి)
9.కైలా లావణ్య (స్వతంత్ర అభ్యర్థి)
10.గౌతంబాబు కొల్లు (స్వతంత్ర అభ్యర్థి)
11.చిక్కాల దుర్గారావు (స్వతంత్ర అభ్యర్థి)
12.తాళ్లూరి రమేష్ (స్వతంత్ర అభ్యర్థి)
13.దత్తాత్రేయ నోరి (స్వతంత్ర అభ్యర్థి)
14.పేరాబత్తుల రాజశేఖరం (తెలుగుదేశం)
15.దొరబాబు యాళ్ల (స్వతంత్ర అభ్యర్థి)
16.నీతిపూడి సత్యనారాయణ (స్వతంత్ర అభ్యర్థి)
17.పినిపే నాగభూషణవర్మ (స్వతంత్ర అభ్యర్థి)
18.పిప్పళ్ల సుప్రజ (స్వతంత్ర అభ్యర్థి)
19.పేపకాయల రాజేంద్ర (శుభ) (స్వతంత్ర అభ్యర్థి)
20.బొడ్డు శ్రీనివాసరావు (స్వతంత్ర అభ్యర్థి)
21.బొమ్మనబోయిన విఎస్ఆర్ మూర్తి (స్వతంత్ర అభ్యర్థి)
22.బొమ్మిడి సన్నిరాజ్ (స్వతంత్ర అభ్యర్థి)
23.బండారు రామ్మోహన్‌రావు (స్వతంత్ర అభ్యర్థి)
24.భీమేశ్వరరావు చిక్కా (స్వతంత్ర అభ్యర్థి)
25.మాకే దేవిప్రసాద్ (స్వతంత్ర అభ్యర్థి)
26.మెర్ల శాస్త్రులు (స్వతంత్ర అభ్యర్థి)
27.మోకన అంబేద్కర్ (స్వతంత్ర అభ్యర్థి)
28.రాజపూడి (స్వతంత్ర అభ్యర్థి)
29.జెటి రామారావు (స్వతంత్ర అభ్యర్థి)
30.రేవులగడ్డ ముఖేష్‌బాబు (స్వతంత్ర అభ్యర్థి)
31.వానపల్లి శివగణేష్ (స్వతంత్ర అభ్యర్థి)
32.ఎం.శ్రీనివాసరావు (స్వతంత్ర అభ్యర్థి)
33.శ్రీనివాస్ విష్ణువఝల (స్వతంత్ర అభ్యర్థి)
34.జివి.సుందర్ (స్వతంత్ర అభ్యర్థి)
35.హాసన్ షరీఫ్ (స్వతంత్ర అభ్యర్థి)

ఏలూరులో ఉపాధ్యాయులను కలిసి ఓట్లు అభ్యర్థిస్తున్న పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి రాఘవులు

## పిడిఎఫ్ అభ్యర్థి రాఘవులు విస్తృత ప్రచారం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

35 సంవత్సరాలుగా ఉపాధ్యాయ, ఉద్యోగ, కార్మిక, నిరుద్యోగుల సమస్యల పరిష్కారంపై పని చేస్తున్న తనకు గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని పిడిఎఫ్ అభ్యర్థి దిడ్ల వీర రాఘవులు కోరారు. గురువారం ఆయన నగరంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. సిఆర్ఆర్ విద్యాసంస్థలు, కాలేజీలు, ప్రభుత్వ కార్యాలయాలు, హైస్కూళ్లు, వాకర్స్ గ్రౌండ్స్, వివిధ సంఘాల పెద్దలను కలిసి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఐదుచోట్ల గ్రాడ్యుయేట్ ఓటర్లతో గెట్ టూ గెదర్ మీటింగ్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో అభ్యర్థి రాఘవులు మాట్లాడుతూ ఉద్యోగావకాశాల కల్పన, ఉద్యోగుల పిఆర్‌సి, ఐఆర్, ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలు, ఎయిడెడ్ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి నిర్విరామంగా కృషి చేస్తానన్నారు. వీరరాఘవులుకు మద్దతుగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్, గుడిపాటి నరసింహారావు, వైఎస్.కనకారావు, కె.రామాంజనేయులు, పి.రవి, జి.శివకుమార్, కె.విజయలక్ష్మి, లాయర్స్ యూనియన్ నాయకులు సత్యనారాయణ, జెవివి నాయకులు ఎస్ఎన్.రమేష్ పాల్గొన్నారు.

**పెద్దాపురం, జగ్గంపేటలో గోపిమూర్తి ప్రచారం**

తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం నుంచి పిడిఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న డివి.రాఘవులుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఎంఎల్‌సి బొర్రా గోపిమూర్తి కోరారు. గురువారం పట్టణంలో ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలపై శాసన మండలిలో గళమెత్తేవారిని, మేధావులను పట్టభద్రులందరు ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించి శాసనమండలికి పంపాలని కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, విద్యార్థి, యువజన సంఘాలు, నిరుద్యోగుల సమస్యలను మండలి వేదికంగా పోరాడుతున్నది పిడిఎఫ్ ఎంఎల్‌సిలు మాత్రమేనని అన్నారు. ఉద్యోగులకు పిఆర్‌సి, ఐఆర్ కోసం, కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ వర్కర్లకు కనీస వేతనాల కోసం, మోగా డిఎస్‌సి ప్రకటించాలని, రైతులకు గిట్టుబాటు ధర కోసం నిర్వహించిన పోరాటాలకు మద్దతుగా నిలిచింది పిడిఎఫ్ ఎంఎల్‌సిలు మాత్రమేనని అన్నారు. ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజవర్గం నుంచి పోటీ చేస్తున్న దిడ్ల వీరరాఘవులు ఉపాధ్యాయ సంఘంలో రాష్ట్ర అధ్యక్షునిగా, ఉద్యోగ జెఎసి ఛైర్మన్‌గా పని చేసారని తెలిపారు. శాసన మండలికి సమర్థులను పంపడానికి పట్టభద్రులందరూ కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. మహారాణి కళాశాల, ఎల్ఐసి, బార్ అసోసియేషన్, మున్సిపల్ కార్యాలయం, ప్రభుత్వ పాఠశాలలు, ప్రయివేటు పాఠశాలలో పట్టభద్రులను కలుసుకుని ఓట్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి డి.క్రాంతికుమార్, మండల అధ్యక్షులు గడిగట్ల సత్తిబాబు, నాయకులు ఎస్.శ్రీనివాస్, ఎన్.సూరిబాబు, గడిగట్ల సత్తిబాబు, కేదారి నాగు, గునూరి రమణ, యాసలపు రమేష్, కూనిరెడ్డి రవికుమార్, పెంటయ్య పాల్గొన్నారు. అలాగే జగ్గంపేటలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా డిగ్రీ కళాశాల, గురుకుల పాఠశాల్లో ఉన్న ఉపాధ్యాయులను ఆయన కలుసుకుని పిడిఎఫ్ అభ్యర్థి రాఘవులును గెలిపించాలని కోరారు.

పెద్దాపురంలో న్యాయవాదులను కలిసిన గోపిమూర్తి

## వరుస చోరీలతో గ్రామస్తుల ఆందోళన

**- సంఘటన స్థలాలను పరిశీలించిన సిఐ, ఎస్ఐ**

ప్రజాశక్తి - కాజులూరు

షాపు యజమానితో మాట్లాడుతున్న సిఐ కృష్ణచైతన్య

మండలంలోని కోలంక గ్రామంలో గత 15 రోజులుగా జరుగుతున్న వరుస చోరీలతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంఘటన స్థలాలను గురువారం సిఐ కృష్ణచైతన్య, గొల్లపాలెం ఎస్ఐ మోహన్‌కుమార్ పరిశీలించారు. మొదటగా సాయి బాబా మందిరంలో హుండీని పగలగొట్టి నగదును ఎత్తుకుపోయారు. అలాగే ప్రయివేటు వైద్యుని ఇంట్లో ఇన్వెర్టర్ బ్యాటరీ చోరీకి గురియైంది. వృద్ధిరాలి మెడలో 3 కాసుల గొలుసును ఎత్తుకుపోయారు. కిరాణా దుకాణం నిర్వహిస్తున్న ఒక మహిళకు చెందిన 3 కాసుల బంగారు గొలుసు చోరీకి గురైంది. ఈ నేపథ్యంలో గురువారం గ్రామాన్ని సందర్శించిన సిఐ స్థానిక వ్యాపారులు, స్థానికులతో మాట్లాడారు. వలస చోరీలతో గ్రామస్తులు ఆందోళన చెందవద్దని, గ్రామ ముఖ్య కూడళ్లలో వ్యాపారస్తులు, స్థానికులు కలిసి సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కొత్త వ్యక్తులు ఎవరైన గ్రామంలో సంచరిస్తే తక్షణమే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో కోటిపల్లి డిసి దాట్ల విజయగోపాలరాజు, వ్యాపారస్తులు వరద వెంకటనాగేశ్వరరావు, గోన సత్తిబాబు, చల్ల బాబురావు, పచ్చిపులుసు సూర్యనారాయణ, బొడ్డు నారాయణ, మానే శ్రీనివాస్, బండ సత్తిబాబు, జానా ప్రసాద్ పాల్గొన్నారు.

## ఎన్నికల నిర్వహణకు సమగ్ర ఏర్పాట్లు

ప్రజాశక్తి - కాకినాడ

కాన్ఫెరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్‌పి

తూర్పు, పశ్చిమ గోదావరి శాసన మండలి పట్టభద్రుల నియోజక వర్గ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేపట్టామని కలెక్టర్ షాన్ మోహన్ సగిలి తెలిపారు. గురువారం ఏలూరు కలెక్టరేట్ నుంచి తూర్పు, పశ్చిమ గోదావరి శాసన మండలి పట్టభద్రుల నియోజక వర్గ ఎన్నికల పరిశీలకులు, రాష్ట్ర చేనేత, జౌళి శాఖ ముఖ్య కార్యదర్శి కె.సునీత, నియోజక వర్గ పరిధిలోని 6 జిల్లాల కలెక్టర్లు, ఎస్‌పిలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్థానిక కలక్టరేట్ నుంచి వీడియో కాన్ఫెరెన్స్‌లో కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి, ఎస్‌పి జి.బిందుమాధవ్ పాల్గొన్నారు. జిల్లాలో పట్టభద్రుల ఎన్నిక నిర్వహణ ఏర్పాట్లను కలెక్టర్ వివరించారు. జిల్లాలోని 2 రెవెన్యూ డివిజన్లు, 21 మండల పరిధిలో 70,540 మంది ఓటర్లు ఉండగా, వీరిలో 42,463 మంది పురుషులు, 28,072 మంది మహిళలు, 5 గురు ట్రాన్స్ జెండర్లు ఉన్నారని తెలిపారు. 96 పోలింగ్ స్టేషన్లు, 2 ఆగ్జలరీ పోలింగ్ స్టేషన్లు వెరసి 98 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వీటిలో కాకినాడ డివిజన్‌లో 67 పోలింగ్ కేంద్రాలు, పెద్దాపురం డివిజన్‌లో 31 కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. పోలింగ్, సహాయ పోలింగ్ అధికారులకు ఈ నెల 14, 20 తేదీలలో, ఒపిఒలకు 21న, మైక్రో అబ్జర్వర్లకు 22వ తేదీన కలెక్టరేట్‌లో శిక్షణ ఇస్తామన్నారు. 26న కాకినాడ డివిజన్‌కు మెక్లారిన్ హెస్కూల్‌లోను, పెద్దాపురం డివిజన్‌కు పెద్దాపురం రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలోను ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాలు ఏర్పాటు చేస్తామని, 27వ తేదీన కలెక్టరేట్ పిజిఆర్ఎస్ హాలులో రిసెప్షన్ సెంటరు, ఇంటర్మీడియేట్ స్ట్రాంగ్ రూమ్‌లను ఏర్పాటు చేస్తామని కలెక్టర్ తెలిపారు. ఎస్‌పి జి.బిందుమాధవ్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు పటిష్టమైన బందోబస్తు ప్రణాళికతో ఏర్పాటు చేస్తున్నామని, జిల్లాలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు లేవని తెలిపారు. ఎంఎల్‌సి ఎన్నికలు, శివరాత్రి ఏర్పాట్లు ఒకేసారి చేపట్టవలసి ఉన్నందున సిబ్బంది కొరత లేకుండా ఎపిఎస్‌పి బలగాల సహకారాన్ని తీసుకునేందుకు అనుమతి కోరారు. ఈ సమావేశంలో ఎఎస్‌పి మనీష్ పాటిల్ దేవరాజ్, డిఆర్ఒ, ఎఆర్ఒ జె.వెంకట్రావు, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ ఎం.జగన్నాధం పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమావేశంలో మాట్లాడుతున్న బేబిరాణి

## 17న ప్రాజెక్ట్ ఆఫీసుల వద్ద ధర్నాలు

ప్రజాశక్తి - కాకినాడ

అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలు పరిష్కారానికి ఈ నెల 17వ తేదీన ప్రాజెక్ట్ ఆఫీసుల వద్ద చేపట్టిన ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జి.బేబీరాణి పిలుపునిచ్చారు. కాకినాడ అర్బన్ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలో ఉన్న అంగన్‌వాడీ వర్కర్లకు సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చి 8 నెలల కాలం అవుతున్న నేటికీ అంగన్‌వాడీల సమస్యలను పట్టించుకోలేదని అన్నారు. అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలు రోజురోజుకు పెరుగుతూనే ఉన్నాయన్నారు. ఆయా సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు దృష్టి పెట్టాలని కోరారు. సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకే ఈ నెల 17న రాష్ట్రంలోని అన్ని ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళనలు ఉదతం చేసేందుకు కార్యకర్తలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా కోశాధికారి మలకా వెంకటరమణ, అంగన్‌వాడీ యూనియన్ కాకినాడ ప్రాజెక్ట్ కార్యదర్శి జ్యోతి, యూనియన్ జిల్లా కోశాధికారి రమణమ్మ, రమ, సరోజ, విజయ, మున్ని తదితరులు పాల్గొన్నారు.

## గోదావరి మహా సమాఖ్య పనితీరుపై సమీక్ష

ప్రజాశక్తి - తాళ్లరేవు

సమావేశంలో మాట్లాడుతున్న పీడీ శ్రీనివాసరావు

కోరంగి పంచాయతీ చినబొడ్డు వెంకటాయ పాలెంలోని గోదావరి మహా సమాఖ్య (జిఎంఎస్) పనితీరుపై డిఆర్‌డిఎ పీడీ శ్రీనివాసరావు గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా సమాఖ్యలోని 7 మండల సమాఖ్యలకు చెందిన రికార్డులను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిపిఎంలు ఎస్‌కె.జిలాని, ఒ.వెంకటేశ్వరరావు, టి.బాబురావు, మురళీకృష్ణ, బి.విష్ణుమూర్తి, సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు బొమ్మిడి వెంకటలక్ష్మి, పెసింగి ధనలక్ష్మి, కోశాధికారి నాగ సులోచన తదితరులు పాల్గొన్నారు.

## రాయితీపై రైతులకు మందుల పంపిణీ

ప్రజాశక్తి - గొల్లప్రోలు

రైతులకు అవగాహన కల్పిస్తున్న డిడి హరి

మినుము పంట సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జరిగింది. గురువారం మండలంలోని దుర్గాడ, ఎ.విజయనగరం గ్రామాలను పెద్దాపురం జిల్లా వనరుల కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ బివిఎస్.హరి మినుము పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు మినుము పంటపై అవగాహన కల్పించారు. మినుము పంటను ఆశించిన తెల్ల దోమ తెగులు నివారణకు ఎసిటి మెప్రైడ్, కస్టోడియ మందును పిచికారి చేయాలని సూచించారు. రైతులకు 50 శాతం రాయితీపై ఇచ్చే కస్టాడియా మందులు, వేప నూనె, ఇతర పురుగు మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఎఒ కెవివిజసత్యనారాయణ, విఎఎ లక్ష్మీరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## అచ్చుతాపురం రైల్వే గేటు మూసివేత

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ - సర్పవరం రైల్వే స్టేషన్ మధ్యలో ఉన్న అచ్చుతాపురం రైల్వే ట్రాక్‌కు మరమ్మతులు చేపట్టనున్నడంతో ఈ నెల 16 నుంచి 26 వరకు అచ్చుతాపురం రైల్వే గేటును మూసివేస్తున్నట్లు కాకినాడ సెక్షన్ ఇంజనీర్ ఎం.రమేష్, అసిస్టెంట్ ఇంజినీర్ పివిఎస్ఎన్.శాస్త్రి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కావున అచ్చుతాపురం గేటు పరిసర ప్రాంతాల ప్రజలు ప్రత్యామ్నాయ రోడ్డు మార్గాలు ఎంచుకుని రైల్వే సిబ్బందికి సహకరించాలని కోరారు.

### కార్టూ'నిజం'




## మామిడి, జీడి మామిడి సస్యరక్షణపై అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం

రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త డాక్టర్ సునీత

మామిడి, జీడి మామిడి సస్య రక్షణపై రైతులకు అవగాహనా కార్యక్రమం జరిగింది. గురువారం మండలంలోని రాయ భూపాలపట్నం రైతు సేవ కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉద్యాన పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ సునీత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మామిడి తోటలు పూత, పిందె కట్టే దశలో ఉన్నందున ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు ఎటు వంటి పురుగు మందులు పిచికారి చేయరాదన్నారు. మామిడి పూత పరపరాగ సంపర్కం కీటకాలతో జరుగుతుందన్నారు. ఈ పురుగు మందులు కొట్టడం వల్ల మేలు చేసే కీటకాలు చనిపోతాయన్నారు. దీనివల్ల పూత రాలిపోయి తక్కువ పిందెలు మాత్రమే మిగులుతాయన్నారు. మామిడి చెట్లపై తామర పురుగులు, బూడిద తెగులు గుర్తించామన్నారు. అధికారులు సూచించిన మందులను 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయటం వల్ల పూత నిలబడి పిందె బాగా కడుతుందన్నారు. అలాగే జీడి మామిడి తోటలలో తామర పురుగులు, చిన్న లద్దె పురుగులు, తేయాకు దోమ, పక్షి కన్ను తెగులు గుర్తించామన్నారు. వీటి ఉధృతిని బట్టి వ్యవసాయ అధికారులు సూచించిన మందులు 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలన్నారు.

రక్తదానం చేస్తున్న ఆర్‌టిసి డిపో సిబ్బంది

## కాకినాడ డిపోలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - కాకినాడ

రోడ్డు భద్రతా మాసోత్సవాలు సందర్భంగా గురువారం కాకినాడ డిపోలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ రక్తదాన శిబిరంలో రోటరీ బ్లడ్ బ్యాంక్, రెడ్ క్రాస్ వారి ఆధ్వర్యంలో 68 మంది రక్తదానం చేశారు. ప్రజా రవాణా అధికారి ఎం.శ్రీనివాసరావు రక్త దానం చేశారు. ఈ కార్యక్రమంలో కాకినాడ, తుని డిపో మేనేజర్లు ఎంయువి.మనోహర్, ఎం.కిరణ్, అసిస్టెంట్ మేనేజర్ టి.బాలకృష్ణ, డిపిటిఒ ఆఫీస్ అసిస్టెంట్ మేనేజర్ ఎస్‌కెఎం.భాషా, పిఆర్ఒ సిహెచ్.వెంకటరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

## బాలలకు కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - పెద్దాపురం

వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

స్థానిక భవిత కేంద్రంలో గురువారం బాల నేత్ర బంధువు కార్యక్రమంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో శ్రీ కిరణ్ కంటి ఆసుపత్రి వైద్య సిబ్బంది పాల్గొని వైద్య సేవలు అందించారు. వికలాంగ బాలలతోపాటు, మహాత్మా గాంధీ పాఠశాల బాలలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎస్.పూజారెడ్డి, వై.శివగణేష్, దుర్గాప్రసాద్, జి.ఉమామహేశ్వరరావు వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ విఆర్‌కె.చౌదరి, హెచ్ఎం ఎంఎల్.శివజ్యోతి, భవిత సిబ్బంది బి.దుర్గాప్రసాద్‌రెడ్డి, బి.ఆనందరావు పాల్గొన్నారు.

## అన్నదానాన్ని ప్రారంభించిన ఎంఎల్ఎ

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక వేణుగోపాల స్వామి ఆలయం వద్ద గురువారం నిర్వహించిన అన్నదానం కార్యక్రమాన్ని ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప ప్రారం భించారు. తొలుత వేణు గోపాలస్వామి ఆలయంలో కుడా ఛైర్మన్ తుమ్మల రామస్వామితో కలిసి ఎంఎల్ఎ ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షులు అడబాల కుమారస్వామి, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ బదుగు శ్రీకాంత్, కూటమి నాయకులు కంటే జగదీశ్‌మోహన్, నిమ్మకాయల కిరణ్, కౌన్సిలర్ బలుసు వాసు, తదితరులు పాల్గొన్నారు.

## పేకాట శిబిరంపై పోలీసుల దాడి

**ప్రజాశక్తి - సామర్లకోట**

పట్టణ పరిసర ప్రాంతంలో ఉన్న క్వారీ గోతుల్లో పేకాట ఆడుతున్న వారిపై పోలీసులు గురువారం దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.4,300 నగదు స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పివిఎస్.మూర్తి తెలిపారు.

## భవన నిర్మాణానికి రూ.లక్ష విరాళం

**ప్రజాశక- ఆత్రేయపురం**

కోనసీమ తిరుమలగా పేరుగాంచిన వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయ శ్రీనివాస ప్రాంగణంలో నిర్మిస్తున్న శ్రీ వకుళ మాత అన్నదాన భవన నిర్మాణానికి గురువారం దాతలు విరాళం అందజేశారు. రావులపాలానికి చెందిన యమ్.విశ్వనాథం, చంద్రమాణిక్యం దంపతులు, వారి కుటుంబ సభ్యులు రూ. 1,10,120 ఆలయ డిసి నల్లం చక్రధర్ రావు అన్నదాన భవన నిర్మాణానికి విరాళం అందజేశారు. దాతలకు స్వామివారి దర్శనం చేయించి తీర్ధ ప్రసాదాలతో పాటు స్వామివారి చిత్రపటాన్ని ఆలయ అధికారులు అందజేశారు.

**జగన్మోహిని కేశవ స్వామి ఆలయంలో..**

ఆత్రేయపురం మండలంలోని ర్యాలి గ్రామంలో శ్రీ జగన్మోహిని కేశవ మరియు గోపాలస్వామి వారి ఆలయానికి వచ్చే యాత్రికులకు అన్నదానానికి దాతలు విరాళాలు అందజేశారు. గుంటూరుకు చెందిన మేడుగుల నాగభూషణ రెడ్డి, విజయలక్ష్మి దంపతులు రూ.5,116 విరాళం తెలియ ఇఒ బివి.రమణమూర్తికి అందజేశారు. అలాగే హైదరాబాద్ చెందిన ఏలేశ్వరపు శివకుమార్ శర్మ, మాధవి దంపతులు రూ.10,116 విరాళం ఇఒకు అందజేశారు. దాతలకు స్వామివారి దర్శనం అనంతరం తీర్ధ ప్రసాదాలతో పాటు స్వామివారి చరిత్ర పుస్తకం, శేష వస్త్రానికి ఆలయ అధికారులు అందజేశారు.

## 1.65 లక్షల ఎకరాల్లో వరి సాగు

**ప్రజాశక్తి - మామిడికుదురు**

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 1.65 లక్ష ల ఎకరాల్లో వరి సాగు చేపట్టారని జిల్లా వ్యవసాయాధికారి వి.బోసు బాబు తెలిపారు మొగలికుదురు రైతు సేవ కేంద్రంలో చేపట్టిన సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమాన్ని గురువారం ఆయన సందర్శించారు 20వేల టన్నుల యూరియా రైతులకు అందుబాటులో సిద్ధం చేశామన్నారు పంటపై ఎలుకలు చేసేనష్టము, నిర్మూలనపై చేపట్టవలసిన యజమాన్య పద్ధతులు వివరించారు సామూహికంగా ఎలుకల నిర్మూలన కార్యక్రమం చేపట్టిన నాడే వాటిని పూర్తిస్థాయిలో నివారించవచ్చని సూచించారు ఈ కార్యక్రమంలో ఆత్మ పీడీ వై.జ్యోతిర్మయ, డిఆర్‌సి ఎడిఎ రాజశేఖర్, డాట్ సైంటిస్ట్ నందకిషోర్, పి.గన్నవరం ఎడిఎ రామ్మో హన్రావు, వ్యవసాయాదికారిణి బి.మృదుల, సహాయ కులు కె శ్రీహరి, ఎంవిఎన్.రెడ్డి రైతులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల విజేతకు సన్మానం

**ప్రజాశక్తి - అమలాపురం రూరల్**

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో విజయం సాధించిన అమలాపురం మండలం పాలగుమ్మి జడ్‌పి ఉన్నత పాఠశాలలో పిఇటిగా పనిచేస్తున్న ఎ. సూర్యకుమారి ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు గుంట్రు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు పాఠశాల సిబ్బంది గురువారం ఘనంగా సన్మానించారు. ఈ నెల 8, 9, 10 తేదీల్లో కాకినాడలో జరిగిన రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో సూర్యకుమారి ప్రతిభ కనబరిచి ఐదు ఈవెంట్లో విజేతగా నిలిచారు. వాలీబాల్ విన్నర్స్, త్రోబాల్ విన్నర్స్, బ్యాడ్మింటన్ డబుల్స్ విన్నర్స్, అథ్లెటిక్స్ ఈవెంట్లలో షాట్‌పుట్ సెకండ్, జావలిన్ త్రో థర్డ్ ప్లేసుతో విజేతగా నిలిచి జిల్లాకు మంచి పేరు తీసుకొచ్చారని పలువురు కొనియాడారు.

# కంపోస్ట్ యార్డ్‌గా బిసి వసతిగృహం

**ప్రజాశక్తి - సామర్లకోట**

హాస్టల్ పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తా, చెదారం

పట్టణంలోని బిసి హాస్టల్ ఆవరణ అంతా కంపోస్ట్ యార్డుగా మారింది. సామర్లకోట రాజీవ్ గృహకల్పను చేర్చి బిసి సంక్షేమ వసతి గృహం ఉంది. అయితే రాజీవ్ గహకల్ప బ్లాక్ 17కు సంబంధించిన అపార్ట్‌మెంట్ కుటుంబాలు తమకు చెందిన చెత్తను పైనుంచి ప్రక్కనే ఉన్న బిసి హాస్టల్ పరిసరాల్లో వేయడంతో బిసి వసతిగృహం కంపోస్ట్ యార్డ్‌గా మారుతోంది. చెత్తతో పాటు మహిళల సానిటరీ ప్యాడ్ వ్యర్థాలు ఉంటున్నాయని, దానితో విష సర్పాలు సైతం వసతి గృహాల్లోకి ప్రవేశిస్తున్నాయని విద్యార్థులు వాపోతున్నారు. మున్సిపల్ అధికారులు తక్షణం జోక్యం చేసుకుని అపార్ట్‌మెంట్ నివాసితులు చెత్తను వేయకుండా చూడాలని హాస్టల్ సంక్షేమ అధికారి జయసుందరి మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినట్లు విద్యార్థులు చెప్పారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ అనిశెట్టి శ్రీవిద్యను వివరణ కోరగా బిసి హాస్టల్ లో చెత్తను తొలగించడానికి శుక్రవారం ప్రత్యేకించి శానిటేషన్ సిబ్బందిని ఏర్పాటు చేసి పారిశుధ్య చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. అలాగే అపార్ట్‌మెంట్ కుటుంబాలు చెత్తను వేయకుండా తగిన హెచ్చరికలు చేయనున్నట్లు కమిషనర్ చెప్పారు.

## 'మాల ఉద్యోగులను వేధిస్తే సహించేది లేదు'

**ప్రజాశక్తి - తుని**

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎఐఎం ప్రతినిధులు

మాల సామాజిక వర్గానికి చెందిన ఐఎఎస్, ఐపిఎస్, ఇతర ప్రభుత్వ ఉద్యోగస్తులను వేధిస్తే సహించేది లేదని అంబేద్కర్ ఇండియన్ మిషన్(ఎఐఎం) ప్రతినిధులు కొల్లాబత్తుల దిలీప్, గుణపర్తి అపురూప, జగటాల వీరబాబు హెచ్చరించారు. గురువారం పట్టణంలో మాల జెఎసి ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడారు. గత వైసిపి పాలనలో ఐపిఎస్ అధికారి పివి.సునీల్‌కుమార్ తనను ఇబ్బందులకు గురి చేశారంటూ డిప్యూటీ స్పీకర్ రఘూ రామకృష్ణంరాజు చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. కూటమి ప్రభుత్వ పాలనలో మాల సామాజికవర్గానికి చెందిన ఉద్యోగులు, అధికారులపై కక్ష సాధింపు చర్యలు అధికం అయ్యాయని, ఇది సరైన విధానం కాదన్నారు. మాల సామాజికవర్గానికి చెందిన అధికారులపై కక్షసాధింపులకు పాల్పడితే మాలలు అందరూ ఉద్యమిస్తారని కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## తాగునీటి బోర్లు ప్రారంభం

బోరును ప్రారంభిస్తున్న నాసా సంస్థ ప్రతినిధులు

**ప్రజాశక్తి - కోటనందూరు**

మండలంలోని అల్లిపూడి, కెఒ అగ్రహారం గ్రామాల్లో ఎస్‌సి సామాజికవర్గాల ప్రాంతంలో నాసా సంస్థ తాగునీటి బోర్లును ఏర్పాటు చేసింది. తమ ప్రాంతంలో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని ఆయా గ్రామస్తులు నాసా సంస్థను ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో నాసా సంస్థ డైరెక్టర్ జ్యోతి ప్రేమదాస్ ఆధ్వర్యంలో ఉచితంగా తాగునీటి బోర్లను ఏర్పాటు చేశారు. ఈ బోర్లను గురువారం మైక్ నైజర్, రాజా కులపతి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాల కార్పొరేషన్ డైరెక్టర్ కొండ్రు మరిడియా, బనెమ్మది సత్యనారాయణ, చిట్టుమూరి శివ, శ్రీను, వెంకటరత్నం పాల్గొన్నారు.

## కేన్సర్ ఆసుపత్రి నిర్మాణ స్థల పరిశీలన

**ప్రజాశక్తి - కాకినాడ**

క్షేత్ర స్థాయి పరిశీలన చేస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్

కేన్సర్ ఆసుపత్రి నిర్మాణానికి అవసరమైన స్థలం కోసం కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి గురువారం నగరంలోని పలు ప్రాంతాలను పరిశీలించారు. తొలుత కలెక్టరేట్ పక్కనే ఉన్న మున్సిపల్ అతిథి గృహం స్థలాన్ని జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి, ఎపిఎంఎస్‌ఐడిసి, ఇతర ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం బాలికల పాలిటెక్నిక్ కళాశాలలో నిర్మించిన 500 పడకల నూతన సమీకృత ఆయుర్వేద ఆసుపత్రిని పరిశీలించారు. అక్కడ జరుగుతున్న నూతన భవన నిర్మాణ పనులు, ఆసుపత్రికి అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి అవసరమైన స్థలం, కేన్సర్ ఆసుపత్రికి అనువైన ప్రదేశాలను మ్యాప్‌ల ద్వారా పరిశీలించి, అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో తహశీల్దార్ జితేంద్ర, ఎపిఎంఎస్‌ఐడిసి ఇఇ సిహెచ్.రత్నరాజు, డిఇ ఎన్ఎస్.చక్రవర్తి, ఆయుష్ వైద్య అధికారులు డాక్టర్ మహమ్మద్ షాజన్ అలీ, కె.శ్రీనివాసు, జిపిటి ఇన్‌చార్జ్ డాక్టర్ సంజయ్, తదితరులు పాల్గొన్నారు.

## మరిడమ్మకు వెండి కుంకుమ భరణి బహూకరణ

**ప్రజాశక్తి - పెద్దాపురం**

వెండి భరిణిని బహుకరిస్తున్న దాతలు

మరిడమ్మ అమ్మవారికి గురువారం తునికి చెందిన దాడిశెట్టి శ్రీదేవి, శివకోటి దంపతులు 292.6 గ్రాముల వెండి కుంకుమ భరణి కెంపు రాయి మూతతో సమర్పించారు. వారికి ఆలయ అసిస్టెంట్ కమిషనర్ విజయలక్ష్మి అమ్మవారి ప్రసాదాలు, చిత్రపటాలు అందజేశారు. గురువారం మఖ నక్షత్రం సందర్భంగా అమ్మవారికి పంచామృత అభిషేకం, పసుపు, కుంకుమ, చందనం, విభూదిలతో ప్రత్యేక అభిషేకాలు, స్వర్ణ, రజత పుష్పాలతో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి, ఆశాధులు, వేద పండితులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆశోక్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభం

**ప్రజాశక్తి - తాళ్లపూడి**

ఆసుపత్రిని ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ వెంకటేశ్వరరావు

తాళ్లపూడిలో నూతనంగా ఏర్పాటు చేసిన అశోక్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌ను ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు, కోట్ నెస్ ఆర్థోపెడిక్ జనరల్ ఆసుపత్రిని టిడిపి సీనియర్ నాయకులు ఆంధ్ర షుగర్స్ ఎమ్‌డి పెండ్యాల అచ్చిబాబు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ ముప్పిడి మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించేందుకు మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రులు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అచ్చిబాబు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మరిన్ని మెరుగైన వైద్య సేవలు అందించేలా ఆసుపత్రుల యాజమాన్యాలు రూపకల్పన చేయాలన్నారు. ఈ కార్యక్రమాల్లో మాజీ మంత్రి కోడెల శివప్రసాద్ తనయుడు టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి కోడెల శివరాం, మాజీ ఎంఎల్ఎ టివి.రామారావు, టిడిపి మండల అధ్యక్షులు నామన పరమేశ్వరరావు, నాయకులు సూరపనేని చిన్ని, పరిమి హరిచరణ్, జనసేన నాయకులు గంటా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సరోజినీ నాయుడు జయంతి

**ప్రజాశక్తి - తాళ్లపూడి**

విజేత హైస్కూల్లో జయంతి వేడుకలు

నైటింగేల్ ఆఫ్ ఇండియాగా పేరు గాంచిన సరోజినీ నాయుడు జయంతిని తాళ్లపూడిలోని శ్రీ విజేత ఇంగ్లీష్ మీడియం హై స్కూల్లో గురువారం ఇంగ్లీష్ డేగా నిర్వహించారు. ఈ సందర్భంగా హై స్కూల్ ఇంగ్లీష్ ఉపాధ్యాయుడు వర్ధన్‌రాజు మాట్లాడుతూ ఇంగ్లీష్ ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ జొన్నకూటి ప్రమోద్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సరోజినీనాయుడు చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ప్రైమరీ స్కూల్ విద్యార్థులు ఇంగ్లీషులో రైమ్స్, స్టోరీస్, హైస్కూల్ విద్యార్థులకు ఇంగ్లీష్ భాష ప్రాముఖ్యతపై పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమణ, రమేష్, రవి, కరుణ, రోజి, వజ్రం, గంగారత్నం పాల్గొన్నారు.

## యానాం వార్తలు

సమస్యలపై అధికారులతో చర్చిస్తున్న మల్లాడి కృష్ణారావు

### సమస్యలపై మల్లాడి సమీక్ష

**ప్రజాశక్తి - యానాం**

నియోజకవర్గంలో నెలకున్న సమస్యలు, వివిధ అభివృద్ధి పనులపై వివిధ శాఖల అధికారులతో ప్రాంతీయ పరిపాలనాధికారి మునిస్వామి అధ్యక్షతన పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలను చర్చించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఖండవల్లి రామకృష్ణ, పిడబ్ల్యుడి ఇఇ చంద్రశేఖరన్, ఎఇ కాళ్ళ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**ప్రజాశక్తి - యానాం**

ఎల్ టి లైన్ల సామర్థ్యం పెంచడం కోసం స్థానిక పాంచాలా స్ట్రీట్, జిఎంసి బాలయోగి నగర్ గ్రామాల్లో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ అధికారులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కావున వినియోగదారులు సహకరించాలని వారు కోరారు.

సమావేశంలో మాట్లాడుతున్న మల్లాడి కృష్ణారావు

### సిబిఎస్ఇ సిలబస్‌పై ఆందోళన వద్దు

**ప్రజాశక్తి - యానాం**

ఈనెల 15వ తేదీ నుంచి ప్రారంభం అయ్యే 10వ తరగతి పరీక్షల నేపథ్యంలో విద్యార్థులు సిబిఎస్ఇ సిలబస్‌పై ఆందోళన చెందవద్దని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు అన్నారు. గురువారం స్థానిక రాజీవ్ గాంధీ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో విద్యాశాఖ అధికారి పంపన లక్షణ ప్రవీణ్ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ బాయ్స్ హైస్కూల్, కమలా నెహ్రూ గర్ల్స్ హైస్కూల్, రాజీవ్ గాంధీ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్స్‌కు చెందిన 10వ తరగతి విద్యార్థులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను శ్రద్ధగా విన్నట్లయితే పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించగల్గుతారని అన్నారు. తల్లిదండ్రులు ప్రయివేట్ పాఠశాలల్లో చదివించ చలేకే ప్రభుత్వ పాఠశాలల్లో చదివిస్తున్నారని గుర్తుంచుకోవాలన్నారు. 10వ తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించి ఉపాధ్యాయులకు, పాఠశాలలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆయన పెన్నులు, పెన్సిళ్ళు, స్వీట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎఒ మునిస్వామి, కమిడి ప్రభాకర్‌రావు, కెవిఎన్.లక్ష్మి పాల్గొన్నారు.

## ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ అద్వర్యంలో వైద్య శిబిరం

**ప్రజాశక్తి - రాజమహేంద్రవరం**

నగరంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ గోలి రామారావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీచే స్థానిక సుంకర భాస్కరరావు నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో గురువారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఇఎన్‌టి, చర్మ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన విద్యార్థులకు ఉచితంగా మందులు అందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వి.శ్రీవిద్య, డాక్టర్ ఎస్.మురళీకష్ణ, డాక్టర్ ఎస్.రవికాంత్ వైద్యసేవలు అందించారు.

# మానవతా సేవా సంస్థ ఏర్పాటుకు చర్యలు

**ప్రజాశక్తి - అమలాపురం**

స్థానిక సర్ సివి.రామన్ స్కూల్ నందు లయన్స్ క్లబ్ అధ్యక్షులు లయన్ రవణం వేణుగోపాల్ రావు అధ్యక్షతన లయన్ జంపన సుమన్ వర్మ ఆధ్వర్యంలో అమలాపురం పరిసర ప్రాంతాల్లో మానవత స్వచ్ఛంద సేవ సంస్థ ఏర్పాటు చేయుటకు సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ రాష్ట్ర ఆత్మీయ సహకార కమిటీ ఛైర్మన్ ఎస్.జానకిరామరాజు, ఉండ్రాజవరం ఛైర్మన్ టివి. కృష్ణారావు విచ్చేశారు. ఈ కార్యక్రమంలో వారిద్దరూ మాట్లాడుతూ మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ 2004లో నమోదు చేశామన్నారు. ఈ సంస్థ ద్వారా పర్యావరణం పరిరక్షణ, అంబులెన్సు, విద్యార్థులకు ఆర్థిక సాయం, నైతిక విలువల బోధన, వాటర్ ట్యాంకర్లు, శాంతి రథాలు, ఫ్రీజర్లు పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ సేవా సంస్థని అమలాపురం ప్రాంతాల్లో కూడా విస్తరించాలని ఉద్దేశంతో ఇక్కడికి వచ్చామన్నారు. ఈ సేవా సంస్థలో సభ్యుడుగా కావడానికి సంవత్సరానికి కేవలం రూ.600 ర చెల్లించి సభ్యుడుగా జాయిన్ అయ్యి మానవతా స్వచ్ఛంద సేవా ద్వారా పైన తెలిపిన కార్యక్రమాలు ప్రజలకు అందుబాటులోకి తీసుకువెళ్లే విధంగా ప్రయత్నించాలన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ పూర్వపు మల్టిపుల్ ఛైర్‌పర్సన్ లయన్ అనిల్ కుమార్ జైన్, లయన్ సుధా గణపతి, లయన్ చిక్కాల సతీష్, లయన్ నడింపల్లి వెంకట రామరాజు,లయన్ పెనుమాల చిట్టిబాబు, లయన్ బూరగాయల శివరామకృష్ణ, లయన్ యెర్రమెల్లి విశ్వేశ్వరరావు ఇతరుల లయన్స్ క్లబ్ సభ్యులు గొడిలంక గ్రామ పెద్దలు పాలొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

ప్రారంభిస్తున్న డిఎంహెచ్ఒ డాక్టర్ ఎం.దుర్గారావు

## సత్వర వైద్య సేవల కోసం అద్దె వాహనం

**ప్రజాశక్తి - అమలాపురం**

స్థానిక ప్రాంతీయ ఆసుపత్రి నందు ఉన్న జిల్లా సత్వర వైద్య సేవలు కేంద్రంలో ప్రత్యేక ఆరోగ్య అవసరాలు ఉన్న పిల్లలను గ్రామాల నుంచి చికిత్స కొరకు కేంద్రానికి తరలించుటకు అద్దెకు తీసుకున్న వాహనాన్ని జిల్లా వైద్య శాఖాధికారి డాక్టర్ ఎం.దుర్గారావు ప్రారంభించారు. జిల్లా వైద్యారోగ్య అధికారి డాక్టర్ దుర్గారావు దొర మాట్లాడుతూ ప్రస్తుతం గ్రామాలలో జరుగుచున్న యన్‌సిడిసిడి సర్వే లో గుర్తించిన చిన్నారు లను స్థానిక ప్రాంతీయ ఆసుపత్రిలో ఉన్న జిల్లా సత్వర వైద్య సేవలు కేంద్రానికి తరలించి ప్రత్యేక సేవలు అందించాలనే ప్రధాన ఉద్దేశంతో వాహనాన్ని అందుబాటు లో కేవలం జరిగిందన్నా రు. కావున సిబ్బంది అందరు గ్రామాలలో ప్రజానీకానికి ఈ యొక్క విషయాన్ని తెలియజేసి తెలియచేసి వైద్య సేవల అవసరమైన వారు ఈ యొక్క తరలింపు సేవలను సద్వినియోగం చేసుకునేందుకు అవగాహన పెంపొందించాల న్నారు .ఈ కార్యక్రమ ంలో అదనపు డిఎంహెచ్ఒ సిహెచ్‌వి.భారత లక్ష్మి, ఆర్‌బియస్‌కె ప్రొగ్రాం ఆఫీసర్ డాక్టర్ జ్యాన్లేవి, యుపిహెచ్‌సి సిబ్బంది, ప్రాంతీయ వైద్యులు సిబ్బంది రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# బర్డ్ ఫ్లూపై జాగ్రత్తలు తీసుకోవాలి

**ప్రజాశక్తి - ఆలమూరు**

ప్రస్తుత సీజన్లో వ్యాపిస్తున్న బర్డ్ ఫ్లూ వ్యాధిపై కోళ్ల ఫారాల నిర్వాహకులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని వెటర్నరీ ఎడి ఎల్.అనిత అన్నారు. రాష్ట్రంలో పలుచోట్ల బర్డ్ ఫ్లూ వ్యాధి సోకి కోళ్లు మృత్యువాత పడుతున్న నేపథ్యంలో మండల కేంద్రంలోని వెటర్నరీ కార్యాలయంలో ఆమె గురువారం విలేకరులతో మాట్లాడారు. ఏ వ్యాధి అయినా ప్రబలడానికి కారణం మనం ఏర్పాటు చేసుకున్న ఫారంలలో పరిశుభ్ర వాతావరణం లేనప్పుడు సంభవిస్తుందన్నారు. అలాగే కోళ్లను పెంచే వారు తగిన జాగ్రత్తలతో వాటిని తాకాలని ఆమె సూచించారు. కోళ్లతో పాటు జంతువులకు వ్యాధి సోకిన అనుమానాలు కలిగినట్లయితే వెంటనే స్థానిక పశుసంవర్ధక శాఖ అధికారులను సంప్రదించాలని ఆమె కోరారు. అలాగే వెటర్నరీ డివిజన్ పరిధిలో ఆలమూరు, కపిలేశ్వరపురం మండలాలు ఉండగా వీటి చెక్‌పోస్టుల వద్ద సిబ్బందితో నిఘా ఏర్పాటు చేసి, కోళ్ళ తరలింపును అరికడుతున్నట్లు ఆమె తెలిపారు. కోళ్ల ఫారాల నిర్వాహకులు పశుసంవర్ధక శాఖ అధికారుల సలహాలు సూచనలు తీసుకుంటూ నడుపుకోవాలన్నారు. అలాగే కోళ్ల పారాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా ప్రతి నిర్వాహకుడు ప్రత్యేక చర్యలు తీసుకుంటూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇంత వరకూ డివిజన్ పరిధిలో బర్డ్ ఫ్లూ వ్యాధి సోకిన దాఖలాలు లేవని ఆమె వివరించారు.

## బాల్ బ్యాడ్మింటన్ రిఫరీ బోర్డు మెంబర్‌గా వెంకట్రావు

**ప్రజాశక్తి - మండపేట**

స్థానిక మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన రికార్డు అసిస్టెంట్ వారా వెంకట్రావు బాల్ బ్యాడ్మింటన్ ఆఫ్ ఇండియా రిఫరీ బోర్డు మెంబర్‌గా ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టికెవి శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్ణాటకలో జరిగిన 70 వ నేషనల్ సీనియర్ మెన్ అండ్ ఉమెన్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఆయన నేషనల్ రిఫరీగా వ్యవహరించారని తెలిపారు.

## ఎంపిపి పాఠశాలకు గ్యాస్ స్టవ్ అందజేత

**ప్రజాశక్తి - ఆలమూరు**


స్టవ్‌ను అందజేస్తున్న దాతలు

చింతలూరు ఎంపిపి పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకానికి అవసరమైన స్టీల్ గ్యాస్ స్టవ్ స్థానిక జనసేన నాయకులు కడలి శ్రీనాగ మోహనసాయి మణికంఠ, పిల్లి శంకరం తమ సొంత నిధులతో కొనుగోలు చేశారు. వారు గురువారం పాఠశాల హెచ్ఎం వుడతా వెంకటేశ్వరరావు సమక్షంలో మిడ్‌డే మీల్స్ నిర్వాహకులకు గ్యాస్ స్టౌవ్ అందజేశారు. కార్యక్ర మంలో ఉపాధ్యాయులు వాసానాగవీరదుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

**ఒరిజినల్ సేల్ దస్తావేజు పోయినది**

నా క్లయింటు **షేక్ అమీన సాహెబ్,** S/o. షేక్ మదీన సాహెబ్ (లేటు), డో.నెం. 1-452, సింగరాయ కాలనీ, అనపర్తి, తూ॥గో॥జిల్లా ఇచ్చిన సంజాయిషీ ప్రకారం నా క్లయింటు యొక్క **ఒరిజినల్ సేల్ దస్తావేజు 2138/2020,** అనపర్తి సబ్ రిజిష్టర్ గారి ఆఫీస్‌లోరిజిష్టర్ కాబడిన ఒరిజినల్ సేల్ దస్తావేజు **ది. 28-12-2024వ తేదీన** నా క్లయింటు పీరా రామచంద్రపురం నుండి అనపర్తి తన బైక్‌పై దస్తావేజు గల కవరు వెనుక హుక్కుకు తగిలించుకుని వస్తుండగా అనపర్తి సెంటర్ నందు పడిపోయినది. కనుక ఎవరికైన దొరికిన ఎడల ఈక్రింది అడ్రస్‌కు తెలియపర్చవలసిందిగా కోరుచున్నాము.

**వి.బి.భాస్కరరావు, అడ్వకేట్**
**డో.నెం. 5-61, వి.ఆర్.పురం, అనపర్తి**
**సెల్: 93953 89623**

**పాస్‌పోర్ట్ పడి పోయినది**

కాశి దుర్గాదేవి భర్త ప్రసాద్ రావు, కర్రీవానిరేవు, తోట్ల పాలెం స్కూల్ దగ్గర, కొత్తలంక వాసిని. ది **09-02-2025** న నేను నా పాస్ పోర్ట్ నెం. **ఆర్ 4550139** గల పాస్ పోర్ట్ ను వీసా నిమిత్తం అమలాపురం ఏజెంట్ వద్దకు హ్యాండ్ బ్యాగ్ లో పెట్టుకుని ముమ్మిడివరం నుండి అమలాపురం ఆటోలో వెళ్తుండగా మార్గ మధ్యలో అనాతవరం సెంటర్ కు వచ్చి చూసుకొనగా ఒరిజినల్ పాస్ పోర్ట్ పడిపోయినది. వెంటనే ఈ పోస్ పోర్ట్ కోసం వేతకగా దొరకలేదు.నా పాస్ పోర్ట్ ఎవరికైనా దొరికిన యెడల నాకు అందజేయగలరని కోరిప్రార్థిస్తున్నాను. అందజేసినవారికి తగు పారితోషికం ఇవ్వబడును.

**కాశి దుర్గా దేవి,**
**భర్త ప్రసాద్ రావు ,డోర్ నెం.1-92, కర్రీ వానీ రేవు, తోట్లపాలెం స్కూల్ దగ్గర, కొత్తలంక,ముమ్మిడివరం మండలం, డా.బి.ఆర్. అంబేడ్కర్ కోనసీమ జిల్లా,**
**సెల్ నెం.98668 42792.**

**మహారాజశ్రీ నరసరావుపేట అడిషినల్ సివిల్ జడ్జి (అడిషినల్ డివిజన్) గారి కోర్టులో..**
**O.S. No:120/2015**

నామాల శ్రీనివాసరావు @ శ్రీనివాస్ చౌదరి ...వాది
మరియు
1) మేదరమెట్ల సుధారాణి వగైరాలు ...ప్రతివాదులు
To,
**D11)** పర్వత్తిని తేజ @ తేజస్వి, S/o సీతారామారావు (లేట్) బి॥ మైనర్ రి॥ బై మధర్, పర్వత్తిని లక్ష్మీ W/o సీతారామారావు (లేట్) R/o మాచర గ్రామం, కపిలేశ్వరపురం మండలం, తూర్పు గోదావరి జిల్లా.

పై నెంబర్ దావాలో పై కోర్టు వారి నుండి మీకు నోటీసులు జారీ చేయించగా మీరు సదరు నోటీసులు తీసుకోని కారణంగా ఈ పేపర్ ప్రకటన ద్వారా మీ యొక్క నోటీసు నిమిత్తం ది. 24-02-2025 వాయిదా అయి ఉన్నది. కావున వాయిదా రోజు ఉదయం 10:30 ని.లకు పై కోర్టు వారి ఎదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేని యెడల సదరు దావా మీ పరోక్ష మందు తీర్మానించ బడును.
కోర్టు వారి ఉత్తరాల ప్రకారం
**వాయిదా ది. 24-02-2025**

ఇట్లు
శ్రీ బి. అనిల్ కుమార్,
వాది తరపు న్యాయవాది, నరసరావుపేట.

**మహారాజశ్రీ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) కోర్టు వారి దివ్య సముఖమునకు, అమలాపురం**
**I.A. No. 461/2022, O.S. No. 65/2019**

*Between:*
విప్పర్తి మాధవరావు -పిటీషనర్/వాది
AND
విప్పర్తి శ్రీరాములు and Others
-రెస్పాండెంట్స్/ ప్రతివాదులు

పేపరు ప్రకటన

*5వ రెస్పాండెంట్/ 5వ ప్రతివాది:*
ముత్తాబత్తుల దుర్గ, W/o. జితేంద్ర, హిందువు, గృహిణి, వయస్సు 53 సం॥లు, డో.నెం. 5-32, ఇందుపల్లి, అమలాపురం రూరల్ మండలం, డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా.

పై నంబరు దావాలో O.S. 65/2019 లో I.A. 461/2022 లో 5వ రెస్పాండెంట్/ ప్రతివాది అయిన మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు అమలు జరిపినను మీరు తీసుకొని యుండలేదు. కావున శ్రీ కోర్టు వారి ఆర్డరు ప్రకారము 5వ రెస్పాండెంట్/ ప్రతివాది అయిన మీకు పేపరు ప్రకటన ద్వారా తెలియచేయమని ఆర్డర్ పాస్ చేసినారు. మీ **వాయిదా ది. 19-02-2025వ తేదీన అయి ఉన్నది.** మీకు ఏవిధమైన అభ్యంతరములు ఉన్నను కోర్టు వాయిదా రోజున శ్రీ కోర్టులో హాజరై మీరు గాని, మీ ప్లీడరు గారి ద్వారా గాని శ్రీ కోర్టు వారి ఎదుట మీ అభ్యంతరములను తెలియపరచుకోవలెను. లేనిచో పరోక్షముగా తీర్మానితులు అవుదురు.

*వాయిదా: 19-02-2025*
*సమయం: ఉదయం 10.30 ని॥లకు*

**SRI.K.MALLAPA RAJU**
**SRI.K.S.SRIRAM**
Advocates, Amalapuram

**మహారాజశ్రీ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) కోర్టు వారి దివ్య సముఖమునకు, అమలాపురం**
**I.A. No. 462/2022, O.S. No. 65/2019**

*Between:*
విప్పర్తి మాధవరావు -పిటీషనర్/వాది
AND
విప్పర్తి శ్రీరాములు and Others
-రెస్పాండెంట్స్/ ప్రతివాదులు

పేపరు ప్రకటన

*5వ రెస్పాండెంట్/ 5వ ప్రతివాది:*
ముత్తాబత్తుల దుర్గ, W/o. జితేంద్ర, హిందువు, గృహిణి, వయస్సు 53 సం॥లు, డో.నెం. 5-32, ఇందుపల్లి, అమలాపురం రూరల్ మండలం, డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా.

పై నంబరు దావాలో O.S. 65/2019 లో I.A. 461/2022 లో 5వ రెస్పాండెంట్/ ప్రతివాది అయిన మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు అమలు జరిపినను మీరు తీసుకొని యుండలేదు. కావున శ్రీ కోర్టు వారి ఆర్డరు ప్రకారము 5వ రెస్పాండెంట్/ ప్రతివాది అయిన మీకు పేపరు ప్రకటన ద్వారా తెలియచేయమని ఆర్డర్ పాస్ చేసినారు. మీ **వాయిదా ది. 19-02-2025వ తేదీన అయి ఉన్నది.** మీకు ఏవిధమైన అభ్యంతరములు ఉన్నను కోర్టు వాయిదా రోజున శ్రీ కోర్టులో హాజరై మీరు గాని, మీ ప్లీడరు గారి ద్వారా గాని శ్రీ కోర్టు వారి ఎదుట మీ అభ్యంతరములను తెలియపరచుకోవలెను. లేనిచో పరోక్షముగా తీర్మానితులు అవుదురు.

*వాయిదా: 19-02-2025*
*సమయం: ఉదయం 10.30 ని॥లకు*

**SRI.K.MALLAPA RAJU**
**SRI.K.S.SRIRAM**
Advocates, Amalapuram

**మహారాజశ్రీ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) కోర్టు వారి దివ్య సముఖమునకు, అమలాపురం**
**I.A. No. 463/2022, O.S. No. 65/2019**

*Between:*
విప్పర్తి మాధవరావు -పిటీషనర్/వాది
AND
విప్పర్తి శ్రీరాములు and Others
-రెస్పాండెంట్స్/ ప్రతివాదులు

పేపరు ప్రకటన

*5వ రెస్పాండెంట్/ 5వ ప్రతివాది:*
ముత్తాబత్తుల దుర్గ, W/o. జితేంద్ర, హిందువు, గృహిణి, వయస్సు 53 సం॥లు, డో.నెం. 5-32, ఇందుపల్లి, అమలాపురం రూరల్ మండలం, డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా.

పై నంబరు దావాలో O.S. 65/2019 లో I.A. 461/2022 లో 5వ రెస్పాండెంట్/ ప్రతివాది అయిన మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు అమలు జరిపినను మీరు తీసుకొని యుండలేదు. కావున శ్రీ కోర్టు వారి ఆర్డరు ప్రకారము 5వ రెస్పాండెంట్/ ప్రతివాది అయిన మీకు పేపరు ప్రకటన ద్వారా తెలియచేయమని ఆర్డర్ పాస్ చేసినారు. మీ **వాయిదా ది. 19-02-2025వ తేదీన అయి ఉన్నది.** మీకు ఏవిధమైన అభ్యంతరములు ఉన్నను కోర్టు వాయిదా రోజున శ్రీ కోర్టులో హాజరై మీరు గాని, మీ ప్లీడరు గారి ద్వారా గాని శ్రీ కోర్టు వారి ఎదుట మీ అభ్యంతరములను తెలియపరచుకోవలెను. లేనిచో పరోక్షముగా తీర్మానితులు అవుదురు.

*వాయిదా: 19-02-2025*
*సమయం: ఉదయం 10.30 ని॥లకు*

**SRI.K.MALLAPA RAJU**
**SRI.K.S.SRIRAM**
Advocates, Amalapuram